సాక్షి సూర్యాపేట

బుధవారం : 19 : జూన్ : 2024



ఆదర్శంగా నిలవాలి

ఆర్యవైశ్యులు ఆదర్శంగా నిలవాలని వాసవీ క్లబ్ అంతర్జాతీయ కోశాధికారి జవహర్‌బాబు పిలుపునిచ్చారు. - 8లో



జర్నలిస్టుల సంక్షేమానికి..

జర్నలిస్టుల సంక్షేమానికి నూతన విధానం రూపొందిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. - 8లో

గరిష్టం / కనిష్టం

36^0 / 27^0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి 28న ఎంపికలు

సూర్యాపేట టౌన్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశానికి జిల్లా స్థాయిలో ఈనెల 28వ తేదీన సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారి జగదీశ్వర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు తొమ్మిది మోటార్ క్వాలిటీ టెస్టులు నిర్వహించి ప్రతిభ కనబరిచిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపిక పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. నాలుగో తరగతి విద్యార్థులు 8 సంవత్సరాల నుంచి 9 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు. స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, ప్రస్తుతం దిగిన 5 పాస్ ఫోర్టు సైజ్‌లు ఫొటోలు, మూడో తరగతి ప్రొగ్రెస్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ :9490023949 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట టౌన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేపట్టే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు హైదరాబాద్‌లో ఇచ్చే ఉచిత శిక్షణలో ప్రవేశానికి నిర్వహించే ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024-25కు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్సీ స్టడీ సర్కిల్ సూర్యాపేట డైరెక్టర్ చిట్టిపాక రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదని పేర్కొన్నారు. టీజీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో జూలై 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, అభ్యర్థులకు జూలై 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలో పొందిన మెరిట్ ప్రాతిపదికన అర్హులైన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఎంపికై న వారికి హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు 10 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం తోపాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారని తెలిపారు. వివరాలకు స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



అర్వపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

అర్వపల్లి: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా వైద్యసిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం ఆదేశించారు. మంగళవారం ఆయన అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్ని రికార్డులను పరిశీలించారు. అలాగే అన్ని గదులను కలియదిరిగి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీహెచ్‌ఓ ఎల్.చరణ్, ఫార్మసిస్ట్ మాధవి, స్టాఫ్ నర్స్ రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

రేపు నల్లగొండలో మినీ జాబ్‌మేళా

నల్లగొండ: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కల్పనకు ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు ఉపాధి కల్పన కార్యాలయంలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు నెలవారి వేతనాలు ఉంటాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లు తీసుకుని ఉపాధికల్పన కార్యాలయానికి నేరుగా హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 78934 20435, 99517 20856 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

'నెట్'కు 198 మంది అభ్యర్థులు గైర్హాజరు

రామగిరి(నల్లగొండ): యూజీసీ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)కు 198 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నల్లగొండలోని నలంద ఫార్మసీ కాలేజీ, ఆల్ఫా జూనియర్ కళాశాలలో జరిగిన ఈ పరీక్షకు 1,119 మంది అభ్యర్థులను కేటాయించారు. వీరిలో 921 మంది పరీక్ష రాయగా 198 మంది గైర్హాజరయ్యారని నెట్ కోఆర్డినేటర్ పార్థసారథి తెలిపారు.

బోనస్‌పై అయోమయం

- ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ
- అధికారంలోకి వచ్చాక సన్నరకం ధాన్యానికేనని ప్రకటన
- ఏ ఏజెన్సీకి అమ్మితే బోనస్ వస్తుందో తెలియని స్థితిలో రైతులు
- సీజన్ మొదలైనా విడుదలకాని మార్గదర్శకాలు



భానుపురి (సూర్యాపేట): జిల్లాలో 2024 వానాకాలం పంటల సాగు మొదలైంది. ఇప్పటికే మెట్టపంటల సాగు 20శాతం పూర్తయింది. ఇక.. వరిసాగు కోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటా వరి ధాన్యానికి ప్రకటించిన రూ.500 బోనస్‌పై జిల్లా రైతాంగంలో కొంత అయోమయం నెలకొంది. దీనిపై ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం, మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో రైతులు ఏ రకం వరిని సాగు చేయాలోనన్న సందిగ్ధంలో పడ్డారు.

సన్నరకం ధాన్యంతోనే సరిపెట్టి..

జిల్లా వ్యాప్తంగా ఏటా 4.50లక్షల ఎకరాల వరకు వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. అధికంగా దొడ్డురకం వరి సాగుకే ఇక్కడి రైతులు ఆసక్తి చూపుతుంటారు. గత వానాకాలం, యాసంగి సీజన్లలో మాత్రం సన్నాలు సాగు చేయడం, మంచి డిమాండ్ ఉండడంతో రైతులు లాభపడ్డారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే క్వింటా వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని తమ మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న రకం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని, దశలవారీగా దొడ్డు రకం వడ్లకు దీనిని వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులు సందిగ్ధంతోనే వరిసాగు పనులు మొదలుపెట్టారు.

ఎక్కడ అమ్మితే బోనస్ వర్తిస్తుందో?

రైతులు సాగు పనులు మొదలు పెట్టినప్పటికీ బోనస్ ఇచ్చే విషయంలో అయోమయం నెలకొంది. సన్నారకం ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తారా.. లేదంటే దొడ్డు రకం ధాన్యానికి కూడా ఇస్తారా అన్నది స్పష్టంగా తెలియని పరిస్థితి. కేవలం సన్న రకం ధాన్యానికి మాత్రమే బోనస్ ఇచ్చే రైతులు ఎక్కడ అమ్ముకుంటే ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందన్నది తేలాల్సి ఉంది. జిల్లాలో రైతులు తాము పండించే సన్నరకం ధాన్యాన్ని అధికంగా మిల్లర్లు, మార్కెట్ యార్డుల్లో విక్రయిస్తుంటారు. అయితే ప్రభుత్వం ధాన్యం అమ్మకాలను ఏ ప్రాతిపదికను తీసుకొని బోనస్ ఇస్తారో తెలియట్లేదు. కేవలం ధాన్యం కొనుగోలు సెంటర్లలో విక్రయించిన సన్నరకం ధాన్యానికి మాత్రమే ఈ బోనస్ ఇస్తారా.. ? మిల్లర్లు, బహిరంగ మార్కెట్లలో అమ్ముకున్న వారికి ఇస్తారా..? అన్నదానిపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇస్తే రైతులు ఆ దిశగా పంటల సాగు చేపట్టే అవకాశం ఉండనుంది.

జిల్లా అభివృద్ధికి ఎంతో కృషిచేశా



వెంకటరావును సన్మానిస్తున్న నూతన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్లు లత, ప్రియాంక

- బదిలీ అయిన కలెక్టర్ వెంకటరావు
- కలెక్టరేట్‌లో ఘనంగా వీడ్కోలు

భానుపురి (సూర్యాపేట): క్రమశిక్షణ, అంకితభావంతో జిల్లా అభివృద్ధికి కృషి చేశానని జిల్లా పూర్వ కలెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ వెంకటరావుకు మంగళవారం కలెక్టరేట్‌లో వీడ్కోలు సమావేశం, నూతన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇరువురిని జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పథకాలు వేగవంతం చేసి అర్హులకు పారదర్శకంగా అందించామన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వినూత్న మార్పు తెచ్చి వెబెక్స్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం చూపామన్నారు. ఈ–ఆఫీస్ చేపట్టి అన్ని శాఖల ద్వారా కాగిత రహిత పాలన అందించామని తెలిపారు. విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తెచ్చి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడం ద్వారా జిల్లా టెన్త్ ఫలితాల్లో ఆరో స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి సాధ్యమని.. ఆ దిశగా అన్ని శాఖల అధికారులు పనిచేసి జిల్లాను రాష్ట్రంలో అగ్రగ్రామిగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, సీహెచ్ ప్రియాంక, జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో గాలివాన బీభత్సం



చింతలపాలెంలో ఇళ్లపై కూలిన భారీ రావిచెట్టు

- పలుచోట్ల కూలిన భారీ వృక్షాలు
- విరిగిన విద్యుత్ స్తంభాలు
- లేచిపోయిన ఇళ్ల పైకప్పు రేకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం), కోదాడ రూరల్: చింతలపాలెం, కోదాడ మండలాల్లో మంగళవారం గాలివాన బీభత్సం సష్టించింది. దాదాపు గంటసేపు వచ్చిన భారీ ఈదురుగాలుల తాకిడికి చింతలపాలెంలోని మర్రిచెట్టు సెంటర్‌లో గల పెద్ద రావిచెట్టు కూకటి వేర్లతో సహా కూలి పక్కనే ఉన్న గంధం అరుణ, తునికిపాటి రవి ఇళ్ల మీద పడడంతొ ఇళ్లు ధ్వంసమయ్యాయి. వీధిలో, కరెంట్ స్తంభాలపై చెట్టు కొమ్మలు పడడంతో వైర్లు తెగిపోయాయి. గ్రామంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామ శివారులోని కొత్తగూడెం వెళ్లే దారిలో కుంట నిండి వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడెం తండాలో భూక్యా శ్రీను ఇంటి పైకప్పుగా ఉన్న రేకులు లేచిపోయాయి. గుడిమల్కా పురం గ్రామ శివారులోని ఊరవాగు పొంగి ప్రవహించడంతో రాకాపోకలు నిలిచి పోయాయి. అలాగే కోదాడ మండలం ఎర్రవరం, రామలక్ష్మీపురం, గణపవరం, బీక్యాతండాలో ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. తీవ్రమైన గాలివాన దుమారంతో ఇళ్లు, హోటళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. పలుచోట్ల చెట్లు నేలకొరిగి కొమ్మలు విరిగాయి.



చింతలపాలెం : గుడిమల్కాపురం వద్ద పొంగిపొర్లుతున్న ఊరవాగు



కోదాడ రూరల్ : ఎర్రవరం స్టేజీ వద్ద లేచిపోయిన హోటల్ పైకప్పు రేకులు

నేడు విద్యుత్ వినియోగదారుల ఫోరం

హుజూర్‌నగర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి బుధవారం కోదాడలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో ఉన్నతాధికారుల సమక్షంలో ప్రత్యేక కోర్టు (కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫోరం) నిర్వహిస్తున్నట్లు హుజూర్‌నగర్ విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్య తెలిపారు. మంగళవారం ఆయన హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విద్యుత్‌కు సంబంధించిన వివిధ సమస్యలపై ఈ ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మట్టపల్లిలో విశేష పూజలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం అర్చకులు విశేష పూజలు, నిత్యకైంకర్యాలు విశేషంగా నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని వైభవంగా జరిపి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి ఆకుపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్, కోదాడలో నేడు మంత్రి పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బుధవారం హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని పీఆర్‌ఓ వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు హుజూర్‌నగర్‌లోని రామస్వామి గట్టు వద్ద ఐటీఐ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.15 గంటలకు చింతలపాలెం మండలం దొండపాడులో దొండపాడు టు ఎన్‌హెచ్–9 కొత్త డబుల్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే, మధ్యాహ్నం 1.45 గంటలకు దొండపాడులో నూతన రెండో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంపై రైతులతో చర్చిస్తారని పేర్కొన్నారు. అనంతరం హుజూర్‌నగర్ మండలం లింగగిరిలో హుజూర్‌నగర్–యాతవాకిళ్ల కొత్త డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తాని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నేరేడుచర్ల మండలం చిల్లేపల్లిలో సోమారం కొత్త డబుల్ రోడ్డు నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5 గంటలకు చిలుకూరులో జెర్రిపోతుల గూడెం కొత్త డబుల్ రోడ్డు నిర్మాణం, సాయంత్రం 6 గంటలకు మునగాల మండలం గణపవరంలో కీతవారిగూడెం–మునగాల డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్

- 22న పోలింగ్
- బ్యాలెట్ పద్ధతిన నిర్వహణ

నల్లగొండ అగ్రికల్చర్ : నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (ఎన్‌డీసీఎంఎస్) చైర్మన్ ఎన్నికకు జిల్లా సహకార శాఖ డిప్యూటీ కోఆపరేటివ్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. చైర్మన్ ఎన్నికను ఈ నెల 22న నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నారు. 2020 ఫిబ్రవరిలో డీసీఎంఎస్‌కు ఎన్నికల జరిగాయి. మొత్తం 10 మంది డైరెక్టర్లలో అప్పుడు సూర్యాపేటకు చెందిన వట్టె జానయ్యయాదవ్‌ను చైర్మన్‌గా, దుర్గంపూడి నారాయణరెడ్డిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. నవంబర్ 2023 సంవత్సరంలో చైర్మన్ వట్టె జానయ్య ప్రాథమిక సహకార సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని సక్రమంగా నిర్వహించలేదన్న కారణంగా డీసీఓ ఆయన పాలకవర్గాన్ని పూర్తిగా రద్దు చేశారు. దీంతో ఆయన డీసీఎంఎస్ చైర్మన్ పదవిని కోల్పోయారు. వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న దుర్గంపూడి నారాయణరెడ్డిని చైర్మన్‌గా నియమించారు. సహకార చట్టం ప్రకారం ఆరునెలల్లో చైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన పాలకవర్గ సమావేశంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని తీర్మానించారు. దీంతో జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసి.. కార్యాలయంలో నోటీసు బోర్డుపై అతికించారు. చైర్మన్ ఎన్నికకు 22వ తేదీన ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 11 గంటల నుంచి 11.30 వరకు నామినేషన్ల పత్రాల పరిశీలన, 12 గంటల నుంచి 2గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, మధ్యాహ్నం 2.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల ఫలితాలను ప్రకటించనున్నారు.



డీసీఎంఎస్ కార్యాలయం

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

పెన్‌పహాడ్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అహంభావంతో ఉండడం వల్లే ప్రజలు తగిన బుద్ధిచెప్పారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బుధవారం నుంచి రెండు రోజుల పాటు సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, చెరుకు ఏకలక్ష్మి, మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, వీరబోయిన రవి, గుంజా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

సాగు పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి

- డీఏఓ శ్రీధర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు

పెన్‌పహాడ్: వరిపంట సాగులో ఆధునిక పద్ధతులు, మెళకువలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్గానిక్ వరి వ్యవసాయంలో ఐసీఏఆర్ అవార్డు గ్రహీత లావణ్య నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి అనుభవాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.కృష్ణసందీప్, క్లస్టర్ ఏఈఓ డి.సంధ్య, సూర్యాపేట డివిజన్ వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు ఎర్రంశెట్టి మురళీ, ధరావత్ నగేష్, రంగినేని శంకరయ్య, రమేష్, భూక్య లాలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో మోసాలు!

- పెట్రోల్ పోయకముందే డబ్బులు చూపిస్తున్న మీటర్లు
- పలుచోట్ల కల్తీ పెట్రోల్, డీజిల్ అమ్మకాలు
- బంకుల్లో సౌకర్యాలూ కల్పించని నిర్వాహకులు
- మోసపోతున్న వినియోగదారులు
- జిల్లాలో 166 పెట్రోల్ బంకులు



సూర్యాపేటలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో గల పెట్రోల్ బంకులో ఆదివారం సాయంత్రం ఓ వినియోగదారుడు పెట్రోల్ పోయించుకునేందుకు తన వాహనాన్ని ఆపాడు. వెంటనే బంకు సిబ్బంది పెట్రోల్ కొట్టేందుకు పంపు నుంచి పెట్రోల్ గన్ తీయగా రూ.5.70 ముందే చూపిస్తుంది. వెంటనే వినియోగదారుడు పెట్రోల్ కొట్టకముందే ఇలా డబ్బులు చూపించడమేంటని ప్రశ్నించగా పంపు రిపేర్‌లో ఉందని సాకులు చెబుతూ కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. దీంతో సదరు వినియోగదారుడు ఆందోళనకు దిగాడు. ఇలా జిల్లాలో అనేక బంకుల్లో మీటర్లలో తప్పులు చూపించడం, వాహనాల్లో పెట్రోల్, డీజిల్ తక్కువ పోయడంలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం నిత్యకృత్యంగా మారాయి.

సూర్యాపేట టౌన్: జిల్లాలో కొన్ని నెలలుగా పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతున్నాయి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తుందని, అందులోనూ కల్తీ జరుగుతుందని వినియోగదారులు తరచూ ఆందోళనలకు దిగుతున్నా అధికారుల పర్యవేక్షణ కరువైంది. బంకుల నిర్వాహకులు మీటర్‌లో ఎక్కువ చూపించడం, వాహనాల ట్యాంకుల్లో పెట్రోల్, డీజిల్ తక్కువ వచ్చేటట్టు చేస్తున్నారు. మీటర్లలో సెట్టింగ్ చేసి పెట్టడం వల్లే పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తుందని, అందులోనూ నీళ్లు కలిపి రావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. బంకుల్లో ట్యాంకర్ల అడుగు భాగంలో సబ్ మెర్సిబుల్ మోటార్ పంపు ఉంటుంది. వీటి ద్వారా పెట్రోల్, డీజిల్ వస్తుండడంతో అందులో నీళ్లు కలిపి వస్తున్నాయి. దీనికి తోడు రెండు నుంచి నాలుగు పాయింట్లు తగ్గించి పెట్రోల్, డీజిల్ పోస్తూ వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు.

బంకుల్లో కనీస వసతులూ శూన్యం

జిల్లాలో మొత్తం 166 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఇందులో ఐవోసీఎల్ 63, హెచ్‌పీసీఎల్ 51, బీపీసీఎల్ 40, రిలయన్స్ 3, ఎస్ఆర్ తొమ్మిది ఉన్నాయి. ఈ బంకుల్లో చాలా వరకు కనీస వసతులు కూడాలేవు. ప్రతి బంకులో మరుగుదొడ్లు, తాగునీరు, వాహనదారులకు ఉచితంగా టైర్లలో గాలి నింపాల్సిన సౌకర్యాలు ఉండాలి. అయితే జిల్లాలో చాలా బంకుల్లో ఇలాంటివి లేవు. ఉన్నా అవి మూలకు పడినట్టుగా తెలుస్తోంది. ఎవరైనా వినియోగదారులు అడిగితే రిపేర్‌లో ఉన్నాయని సిబ్బంది చెబుతుండడం గమనార్హం.

నామమాత్రంగా తనిఖీలు

పెట్రోల్ బంకులను తరచూ తూనికలు, కొలతల శాఖ, సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీ చేయాలి. లీటర్ పెట్రోల్‌లో ఏమైనా కోత వేస్తున్నారా.. పూర్తి స్థాయిలో పాయింట్లు వస్తున్నాయా.. ఎక్కడైనా పాయింట్లు జంప్ అవుతున్నాయా.. పెట్రోల్ నాసిరకంగా వస్తుందా.. అనేవి తరచూ పరిశీలించాలి. కానీ, సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రంగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బంకుల నిర్వాహకులు మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

సూర్యాపేటలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో ఆదివారం జరిగిన ఘటనకు సంబంధించి ఆ బంకులోని నాజిల్‌ను సీజ్ చేశాం. సాంకేతిక సమస్య కారణంగా మీటర్‌లో ఎక్కువ డబ్బులు చూపించింది. ఇలాంటివి ఏ బంకులోనైనా జరిగితే తమకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. బంకుల నిర్వాహకులు నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వినియోగదారులకు సేవలందించాలి.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ, సూర్యాపేట

క్లుప్తంగా

నిత్యాన్నదాన ప్రసాదానికి రూ.18లక్షలు విరాళం



ఈఓ భాస్కర్‌రావుకు చెక్కు అందజేస్తున్న రామకృష్ణరావు, జ్యోతి దంపతులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులకు భక్తులకు నిత్యాన్నదాన ప్రసాదం పంపిణీ కోసం హైదరాబాద్‌లోని అజత్రా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు నిమ్మలగడ్డ రామకృష్ణరావు, జ్యోతి దంపతులు రూ.18లక్షల విరాళం ప్రకటించారు. మంగళవారం స్వామివారిని నిమ్మలగడ్డ రామకృష్ణరావు, జ్యోతి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం రూ.18లక్షల చెక్‌ను ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు అందజేశారు.

భువనగిరి ఖిలా వద్ద ట్రైనీ ఐఏఎస్‌ల సందడి



భువనగిరి ఖిలా వద్ద ట్రైనీ ఐఏఎస్‌లు

భువనగిరి: ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్–2023 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం మంగళవారం భువనగిరి ఖిలాను సందర్శించారు. తెలంగాణ కేడర్‌కు చెందిన వీరు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్నారు. వీరు శిక్షణలో భాగంగా ఖిలాను సందర్శించారు. వీరికి గైడ్ ఆవుల వినోద్‌కుమార్ భువనగిరి ఖిలా ప్రాముఖ్యతను వివరించారు. సందర్శించిన వారిలో ట్రైనీ ఐఏఎస్‌లు ఎస్. ఉమాహారతి(వికారాబాద్), అజ్మీరా సంకేత్ కుమార్(నిజామాబాద్), గరిమా నరుల(నారాయణపేట), అభిజ్ఞాన్ మాలవీయ(ఆదిలాబాద్), అజయ్ యాదవ్(కరీంనగర్), మ్రినల్ శ్రేష్ఠ(ఖమ్మం), ఐఈఎస్ఎస్‌డీ మనోజ్(సంగారెడ్డి), నోడల్ ఆఫీసర్ పెద్దబోయిన శ్రీనివాస్ తదితరులున్నారు.

తండ్రి మరణాన్ని తట్టుకోలేక..

- గుండెపోటుతో తనయుడు మృతి
- ఒక్కరోజు వ్యవధిలోనే రెండు విషాదాలు

శాలిగౌరారం: కన్న తండ్రి మరణాన్ని తట్టుకోలేక గుండెపోటుతో కొడుకు మృతిచెందిన ఘటన శాలిగౌరారం మండలంలోని మనిమద్దె గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. మనిమద్దె గ్రామానికి చెందిన అంతటి శంకరయ్య(72)కు భార్య, వివాహితులైన ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీను అనారోగ్యం బారిన పడి ఆరేళ్ల క్రితం మృతిచెందాడు. చిన్న కుమారుడు రాంబాబు(34) భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ అక్కడే ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శంకరయ్య, అతడి భార్య మనిమద్దె గ్రామంలోనే ఉంటున్నారు. శంకరయ్య అనారోగ్యంతో మూడు నెలలుగా మంచం పట్టి ఆదివారం మృతిచెందాడు. తండ్రి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న రాంబాబు హైదరాబాద్ నుంచి కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వచ్చాడు. తండ్రి మృతదేహాన్ని చూసినప్పటి నుండి శంకరయ్య తీవ్ర మనోవేదనతో రోదిస్తూ ఉన్నాడు. బంధువులు, ఎంత నచ్చజెప్పినా దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. సోమవారం మధ్యాహ్నం గ్రామంలో తండ్రి శంకరయ్య అంత్యక్రియలు జరి గాయి. అంత్యక్రియల అనంతరం ఇంటికి వచ్చిన రాంబాబు తండ్రి మరణాన్ని తట్టుకోలేక సాయంత్రం గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు,



రాంబాబు (ఫైల్)



శంకరయ్య (ఫైల్)

బంధువులు, గ్రామస్తులు వెంటనే రాంబాబును నార్కట్‌పల్లిలోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ రాంబాబును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అదే రోజు రాత్రి రాంబాబు మృతదేహాన్ని మనిమద్దెకు తీసుకురాగా మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. రాంబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక్కరోజు వ్యవధిలో తండ్రీకొడుకు మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. చిన్నపాటి పెంకుటిల్లు తప్ప ఎలాంటి స్థిరాస్తులు లేని ఆ కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి, ఇద్దరు కుమారులు దూరం కావడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

పత్తి రైతుల పాట్లు



తిరుమలగిరి(సాగర్): యల్లాపురంలో స్ప్రింక్లర్లతో పత్తి మొక్కలకు నీరందిస్తున్న రైతులు

ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురవడంతో తిరుమలగిరి మండల వ్యాప్తంగా పది రోజుల క్రితమే ఎనభై శాతం మేర రైతులు పత్తి విత్తనాలను విత్తారు. అప్పటి నుంచి వర్షాలు లేకపోవడంతో మొలకెత్తిన పత్తి మొక్కలు ఎండవేడికి తట్టుకోలేక చనిపోతూ, మరికొన్ని నేలవారిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో మొలకలు రాక భూమిలోనే ఉండిపోయాయి. నీటి వసతి ఉన్న రైతులు మొలకెత్తిన మొక్కలను కాపాడుకునేందుకు స్ప్రింక్లర్ల సాయంతో నీటిని అందిస్తూ నానా పాట్లు పడుతున్నారు.

– తిరుమలగిరి(నాగార్జునసాగర్)

భార్య తరఫు బంధువుల దాడిలో భర్త మృతి

- గుడుగుంట్లపాలెం గ్రామంలో ఘటన

పాలకవీడు: భార్యపై అనుమానంతో వేధింపులకు గురిచేస్తున్న భర్తపై ఆమె తరఫు బంధువులు దాడి చేయడంతో మృతిచెందాడు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని ముసిబడ్డుసింగారం గ్రామానికి చెందిన ఆరుట్ల చిరంజీవి(40)కి గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన అరుణతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. సాఫీగా సాగుతున్న వారి దాంపత్య జీవితంలో అనుమానం అనే విషబీజం చిచ్చురేపింది. గత రెండు సంవత్సరాలుగా చిరంజీవి, అరుణ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. భర్తకు ఉద్యోగం లేకపోవడంతో అరుణ గత రెండు సంవత్సరాలుగా హుజూర్‌నగర్ పరిధిలోని చిలుకూరు బాలికల గురుకుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తూ కుటుంబ భారం మోస్తోంది. భార్యపై అనుమానంతో చిరంజీవి తరచూ పాఠశాల వద్దకు వెళ్లి గొడవ చేస్తుండడంతో ఆమెను పాఠశాలకు రావొద్దన్నారు. దీంతో అరుణ మూడు నెలలుగా తన పుట్టినిల్లు గుడుగుంట్లపాలెంలో పిల్లలతో కలిసి ఉంటోంది. రెండు రోజుల క్రితం అరుణ నేరేడుచర్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లగా చిరంజీవి అక్కడికి వెళ్లి పాఠశాల సిబ్బందితో గొడవ పడ్డాడు. దీంతో అరుణను రిజెక్ట్ చేశారు. సోమవారం అర్ధరాత్రి గుడుగుంట్లపాలెం వెళ్లిన చిరంజీవి భార్యతో గొడవకు దిగాడు. కత్తితో అరుణపై దాడి చేసేందుకు ప్రయత్నించగా ఆమె ఒక్కసారిగా కేకలు వేయడంతో ఆమె తరఫు బంధువులు వచ్చి చిరంజీవిని బంధించి విచక్షణారహితంగా కొట్టడంతో అతడు అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అరుణ వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అప్పటికే చిరంజీవి మృతిచెందాడు. దీంతో అరుణ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అరుణను కొంతకాలంగా చిరంజీవి చిత్రహింసలకు గురిచేస్తున్నాడన్న కోపంతో ఆమె తరఫు బంధువులు అతడిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో మృతిచెందినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడి అన్న నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



గుడుగుంట్లపాలెం గ్రామంలో విచారణ చేస్తున్న పోలీసులు

ప్రాణం తీసిన అతివేగం

- రెండు బైక్‌లు ఢీ
- యువతి, యువకుడు దుర్మరణం
- మరొకరికి గాయాలు

కనగల్: అతివేగం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. రోడ్డు క్రాస్ చేస్తున్న బైక్‌ను మరో బైక్ అతివేగంగా ఢీకొట్టడంతో ఓ యువతి, యువకుడు ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కనగల్ ఎస్‌ఐ బొడిగ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం గోవిందన్నగూడెం గ్రామానికి చెందిన కొండ కృష్ణయ్య తన పెద్ద కుమార్తె అరుంధతి(22)తో కలిసి మంగళవారం ఉదయం బైక్‌పై నల్లగొండ పట్టణంలోని అయ్యప్ప గుడికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కనగల్ మండలం బాబాసాహెబ్‌గూడెం స్టేజీ వద్ద నల్లగొండ–నాగార్జునసాగర్ హైవే పైకి వీరి బైక్ క్రాస్ చేస్తుండగా అదే సమయంలో హాలియా నుంచి నల్లగొండకు తిరుమలగిరి(సాగర్)కు చెందిన బత్తుల పవన్ కుమార్(23) బైక్‌పై అతివేగంగా వస్తూ వెనుక నుంచి వీరిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృష్ణయ్య, అరుంధతి రోడ్డుపై పడిపోగా అరుంధతి తలకు బలమైన గాయమైంది. కృష్ణయ్య భుజం, పక్కటెముకలు విరిగిపోయాయి. వీరి బైక్‌ను ఢీకొట్టిన పవన్‌కుమార్ సైతం రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయాలతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పవన్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు కృష్ణయ్య, అరుంధతిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అరుంధతి మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. కృష్ణయ్యకు చికిత్స అందిస్తున్నారు. మృతురాలి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి నూతన విధానం

- మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి

సూర్యాపేట: జర్నలిస్టుల సంక్షేమానికి త్వరలో నూతన విధానం రూపొందిస్తున్నామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఖమ్మంలో జరుగుతున్న టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర మహాసభలకు వెళ్తున్న ఆయనతో పాటు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు కొణిజేటి సత్యనారాయణను సూర్యాపేటలో జర్నలిస్టులు పూల బొకేలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇళ్లు, ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని జర్నలిస్టుల్లో నమ్మకం, విశ్వాసం ఏర్పడ్డాయని చెప్పారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించామని జర్నలిస్టుల సంక్షేమానికి విధివిధానాలు రూపొందిస్తే వెంటనే సంతకం చేసి అమలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు. హెల్త్ కార్డుల విషయంలో ఏర్పడ్డ సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో 24 వేల అక్రిడిటేషన్లు కలిగి ఉన్నామని వివరించారు. అనర్హులకు అక్రిడిటేషన్లు అందకుండా ఒక క్రీమ్‌లైన్ ఏర్పాటు చేస్తామని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు తప్పకుండా అక్రిడిటేషన్ వచ్చేలా చూస్తామన్నారు. ఈ నెలతో ముగుస్తున్న అక్రిడిటేషన్ల గడువును మూడు నెలలు పెంచుతామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కోశాధికారి రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బంటు కృష్ణ, మల్లికార్జున్, విజయకుమార్, నాగరాజు, రామకృష్ణ, హరి, జర్నలిస్టులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఓరుగంటి మనోజ్ కుమార్(35) ఈ నెల 17వ తేదీ ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని పట్టణ పోలీసులకు మంగళవారం అతడి భార్య అనూష ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పట్టణ సీఐ సురేష్‌కుమార్ కేసును పర్యవేక్షిస్తుండగా ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మనోజ్‌కుమార్

అదుపుతప్పి కారు బోల్తా.. వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- కుమారులను కాలేజీలో చేర్పించి వస్తుండగా ప్రమాదం
- ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలో ఘటన

యాదగిరిగుట్ట రూరల్ (ఆలేరు రూరల్): తమ కుమారులను హైదరాబాద్‌లో కాలేజీలో చేర్పించి వస్తుండగా.. కారు అదుపుతప్పి కల్వర్టు పైనుంచి బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆలేరు మండలం శారాజీపేట గ్రామం సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గుండాల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన గవ్వల అయిలయ్య(42) వ్యవసాయం, గొర్ల బేరం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తన చిన్న కుమారుడితో పాటు తన స్నేహితుడు మేడ అయిలయ్య కుమారుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంటర్ కాలేజీలో చేర్పించడానికి సోమవారం ఉదయం మేడ అయిలయ్య కారులో వెళ్లారు. వీరి నలుగురితో పాటు మేడ అయిలయ్య భార్య మేడ కవిత కూడా వెళ్లింది. అక్కడ వారి కుమారులను కాలేజీలో చేర్పించిన తర్వాత తమ వ్యక్తిగత పనులు చూసుకుని రాత్రి తిరిగి బ్రాహ్మణపల్లికి బయల్దేరారు. ఈ క్రమంలో ఆలేరు మండలం శారాజీపేట గ్రామ శివారులోనికి రాగానే రాత్రి 11గంటల సమయంలో అతివేగంతో ఉన్న వీరి కారు అదుపుతప్పి కల్వర్టు పైనుంచి పల్టీ కొట్టి బోల్తా పడింది. దీంతో గవ్వల అయిలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న మేడ అయిలయ్య, వెనక కూర్చున్న తన భార్య మేడ కవితకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయపడిన వారిని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కారును అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట శ్రీను తెలిపారు.



అయిలయ్య (ఫైల్)



బోల్తాపడిన కారు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మద్దిరాల: కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మద్దిరాల మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన మలికంటి సత్తయ్య(65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ నాగయ్య తెలిపారు.



సత్తయ్య (ఫైల్)

మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీ

చిట్యాల: ఆరు బయట నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో నివాసముంటున్న కంబాలపల్లి స్వామి, అతడి భార్య అండాలు సోమవారం రాత్రి తమ ఇంటి ముందు ఆరు బయట నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి ప్రహరీ ఎక్కి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి అండాలు మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకుని పరారయ్యాడు. వెంటనే నిద్ర లేచిన స్వామి, అండాలు దొంగను పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ అతడు తప్పించుకుని పారిపోయాడు. బాధితులు మంగళవారం చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్యవైశ్యులు అందరికీ ఆదర్శంగా నిలవాలి

- వాసవీ క్లబ్ అంతర్జాతీయ అదనపు కోశాధికారి తెడ్ల జవహర్‌బాబు

గరిడేపల్లి: ఆర్యవైశ్యులు సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని వాసవీ క్లబ్ అంతర్జాతీయ అదనపు కోశాధికారి తెడ్ల జవహర్‌బాబు పిలుపునిచ్చారు. గరిడేపల్లిలోని సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో వాసవీ, వనితా క్లబ్ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులతో పాటు సమాజంలోని నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన సేవలను ఉచితంగా అందించే లక్ష్యంతో వాసవీ, వనితా క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాపార అవసరాల నిమిత్తం ఆర్యవైశ్యులు పట్టణాలకు వలస వెళ్లటంతో గ్రామాల్లో ఆర్యవైశ్యుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. అయినప్పటికీ గ్రామాల్లో ఉన్న కొద్దిమంది ఆర్యవైశ్యులు సంఘటితంగా ముందుకొచ్చి వాసవీ క్లబ్‌లను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు అందించాలని కోరారు. గరిడేపల్లి వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా గెల్లి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇల్లింద్ర సురేష్, కోశాధికారిగా ఈగ వెంకటేశ్వర్లు, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా పోలిశెట్టి ధనలక్ష్మి ప్రధాన కార్యదర్శిగా ఇల్లింద్ర కల్పన, కోశాధికారిగా గెల్లి పుష్పలత ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్, వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, చైర్‌పర్సన్స్ వీరవెల్లి పద్మావతి, కొత్తా లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలత, మండల ఆర్యవైశ్య నాయకులు పోలిశెట్టి అంజయ్య, తొడుపునూరి కృష్ణమూర్తి, పెద్దబాబు, శ్రీరంగం ప్రసాద్, రత్నాకర్, మాజీ వనితాక్లబ్ అధ్యక్షురాలు శ్రీరంగం కవిత, బొడ్ల హనుమంతరావు, నర్సింహారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసవీ క్లబ్ అంతర్జాతీయ అదనపు కోశాధికారి తెడ్ల జవహర్‌బాబు

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


- వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ మాధవి

త్రిపురారం: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ మాధవి అన్నారు. మంగళవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుంటూ కేవీకేల ఆధ్వర్యంలోని శిక్షణ కార్యక్రమాలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాబార్డు డీడీఎం సత్యనారాయణ, కంకణాల నివేదితరెడ్డి, హాలియా ఏడీఏ వెంకట్ రవీందర్, ఉద్యానవన అధికారి మురళి, ఏఓ పార్వతి చౌహాన్, సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, మండల బీజేపీ నాయకులు, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ మాధవి

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

కోదాడ రూరల్: కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర గ్రామంలో మంగళవారం షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తమ్మర గ్రామంలోని సుందరయ్య కాలనీకి చెందిన మొగిలి వెంకన్న పూరింట్లో నివాసముంటున్నాడు. మంగళవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు లేచి పూరిల్లుకు అంటుకున్నాయి. స్థానికులు వెంటనే ఫైరింజన్‌కు ఫోన్ చేసి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా.. అక్కడ రెండు గ్యాస్ సిలిండర్‌లు ఉండటంతో వెనక్కి తగ్గారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేలోపు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గొర్రెలు అమ్మగా వచ్చిన రూ.4లక్షల నగదుతో పాటు టీవీ, మూడు తులాల బంగారం, దుస్తులు కాలిబూడిదయ్యాయని బాధితుడు తెలిపాడు. బాధితుడిని స్థానిక వార్డు కౌన్సిలర్ సామినేని నరేష్ పరామర్శించి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు వచ్చేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

ఎంజీయూ డిగ్రీ విద్యా ప్రణాళిక విడుదల

నల్లగొండ రూరల్: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ల విద్యా ప్రణాళికను యూనివర్సిటీ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ కొప్పుల అంజిరెడ్డి మంగళవారం విడుదల చేశారు. జూన్ 18 నుంచి తరగతులు ప్రారంభించి నవంబర్ 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్నల్ పరీక్షలు, సంక్రాంతి సెలవులు, ప్రిపరేషన్ హాలిడేస్ వివరాలను తెలుపుతూ సర్క్యులర్ జారీ చేశారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

- భూ తగాదా ఫిర్యాదుపై పోలీసులు స్పందించలేదని మనస్తాపం
- పురుగుల మందు తాగుతుండగా అడ్డుకున్న పోలీసులు

నిడమనూరు: భూ తగాదాకు సంబంధించి తాను ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు స్పందించడం లేదని మనస్తాపం చెందిన ఓ రైతు మంగళవారం నిడమనూరు పోలీస్ స్టేషన్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ గోపాలరావు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం ఎర్రబెల్లికి చెందిన తుంగతుర్తి వెంకటాచారి, తుంగతుర్తి ధనుంజయాచారి అన్నదమ్ములు. అన్నదమ్ములిద్దరి మధ్య గత 15 సంవత్సరాలుగా భూ తగాదాలు నడుస్తున్నాయి. అదేవిధంగా పక్కనే ధర్మాపురం గ్రామ శివారులో వెంకటాచారి భూమి పక్కనే ఉన్న దాసోజు కనకాచారి అనే వ్యక్తితో కూడా వెంకటాచారికి భూ వివాదం నడుస్తోంది. అయితే తన ఆధీనంలో ఉన్న భూమిలోని ఫెన్సింగ్ రాళ్లు, పత్తి మొక్కలను వెంకటాచారి తన మనుషులను తీసుకెళ్లి ధ్వంసం చేశాడని దాసోజు కనకాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటాచారి, అతడి మనుషులపై ఈ నెల 13న నిడమనూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరువర్గాల రాజీతో ఈ గొడవ సద్దుమణిగింది. దాసోజు కనకాచారి ఫిర్యాదు ఇచ్చిన వెంటనే తనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. తన అన్నపై తాను ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించడంలేదని మనస్తాపానికి గురైన వెంకటాచారి మంగళవారం మధ్యాహ్నం నిడమనూరు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి పురుగుల మందు తాగుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. వెంకటాచారిని మిర్యాలగూడకు అక్కడి నుంచి నల్లగొండకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. కాగా వెంకటాచారి ఆత్మహత్యాయత్నానికి పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని ఎస్‌ఐ తెలిపారు.



చికిత్స పొందుతున్న వెంకటాచారి

పాముకాటుతో యువకుడు మృతి

మోటకొండూర్: పాముకాటుతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇక్కుర్తి గ్రామానికి చెందిన బడికె ఉదయ్‌కుమార్(18) సోమవారం సాయంత్రం తమ వ్యవసాయ క్షేత్రం వద్ద గడ్డివాము నుంచి పశువుల కోసం గడ్డిని తీస్తుండగా పాము కాటు వేసింది. దీంతో అక్కడే ఉన్న ఉదయ్ తండ్రి ఉపేందర్ వెంటనే అతడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు సూచన మేరకు జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఉదయ్‌కుమార్ ఇంటర్ పూర్తిచేసి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.



ఉదయ్‌కుమార్ (ఫైల్)